క్లుప్తంగా

కాలువ భూమి ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు గ్రామంలో కొంతమంది వ్యక్తులు కాలువ భూమిని ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నాగమణికి గ్రామస్తులు శుక్రవారం ఫిర్యాదుచేశారు. కాలువ భూమిని ఆక్రమించి జామాయిల్, పొగాకు పంటలు వేసుకుని లబ్ధి పొందుతున్నారన్నారు. కౌలుకు సైతం ఇస్తున్నారని ఆరోపించారు. దీనిపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు స్పందించి చర్యలు తీసుకోవాల్సిందిగా వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగమణి వారికి తెలిపారు. అఖిల భారత రైతు కూలీ సంఘ నాయకుడు కలింపూడి సుందర్రావు ఆధ్వర్యాన దిప్పకాయలపాడు గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

కుక్కునూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

కుక్కునూరు: సాధారణ తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి శుక్రవారం కుక్కునూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను ముందుగా గుర్తించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు మండలంలో గత ఎన్నికల్లో ఏమైనా సమస్యలు తలెత్తిఉంటే ఈసారి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల పై ఆరా తీశారు. అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టును మరింత పటిష్టం చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు.

సత్యసాయి మంచినీటి పథకం పరిశీలన



పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ రవికుమార్

పోలవరం రూరల్: పోలవరం మండలం కన్నాపురం అడ్డ రోడ్డు వద్ద గల సత్యసాయి మంచినీటి పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ రవి కుమార్ పరిశీలించారు. పథకం నుంచి నీటి సరఫరా తదితర విషయాలను ఆయన తెలుసుకున్నారు. ఏవైనా మరమ్మతులు చేయాల్సి ఉందాని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రక్షిత మంచినీటి పథకాల పరిస్థితి, వసతులను పరిశీలించాలన్న ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు వీటిని పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫిల్టర్ బెడ్ పని తీరును కూడా ఆయన పరిశీలించారు. సీఈ వెంట ఎస్ఈ కె.సత్యనారాయణ, ఈఈ బాల శంకర్రావు, ఏఈ అజయ్‌బాబు ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీపీ



కొత్త పట్టిసీమలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

పోలవరం రూరల్: పోలవరం మండలం కొత్త పట్టిసీమ నుంచి సగ్గొండకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా ఈ రోడ్డు మార్గంలోనే అధిక సంఖ్యలో రైతులు, రైతు కూలీలు రాకపోకలతో పాటు పొలాల నుంచి పంటలను కూడా ఇళ్లకు తీసుకెళ్తుంటారు. ఇటీవల కొవ్వాడ కాలువ క్రాసింగ్ వద్ద కాజ్‌వే అప్రోచ్ రోడ్డు పనులను ప్రారంభించి ముమ్మరంగా చేస్తున్నారు. ఈ పనులను ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, ఎంపీటీసీ వలవల వరలక్ష్మి, మండల పరిషత్ ఏవో సీహెచ్ శ్రీనివాసబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్ రైతులతో కలిసి కాజ్‌వే పనులను పరిశీలించారు. కాజ్‌వే రోడ్డు నిర్మాణంతో రాకపోకలకు ఎంతో వీలుగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'కంటి వెలుగు' పేద విద్యార్థులకు వరం

భీమడోలు: జగనన్న ఆరోగ్య సురక్ష కంటి వెలుగు పథకం పేద విద్యార్థుల పాలిట వరమని భీమడోలు హైస్కూలు ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్ఎస్ అహ్మద్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాలలో 52 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించారు.

క్రీడోత్సాహం.. గ్రామాల్లో సందడి

- అట్టహాసంగా 'ఆడుదాం ఆంధ్ర'
- పోటీపడుతున్న ఆటగాళ్లు



జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: యువత మంచి మార్గంలో నడవటానికి విద్యతో పాటు క్రీడలు కూడా అవసరం అని గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని రూపొందించారని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మహిళలకు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆమె క్రీడాకారులను పరిచయం చేసుకుని, కొద్దిసేపు వారితో కలిసి కబడ్డీ ఆడారు. పట్టణంలోని 5 సచివాలయాల పరిధిలో కబడ్డీ విభాగంలో 7 మ్యాచ్‌లు నిర్వహించారు. ఖోఖో పోటీల్లో 3 సచివాలయాల పరిధిలో 8 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు మానవత మూర్తి, సంకు సురేష్, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో విజయ ప్రసాద్, హైస్కూల్ పీడీ జయరాజు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో ప్రతిభ వెలికితీతకు దోహదం

జంగారెడ్డిగూడెం రూరల్: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలను నిర్వహిస్తున్నారని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల క్రీడా మైదానాల్లో ఆటలు పోటీలు జరిగాయి. శ్రీనివాసపురంలో జరిగిన కబడ్డీ పోటీలను జెడ్పీటీసీ ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో వాలీబాల్ పోటీలు

కొయ్యలగూడెం: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో శుక్రవారం 200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నట్లు ఎంపీడీవో, మండల కమిటీ చైర్మన్ ఆర్.బేబీ శ్రీలక్ష్మి తెలిపారు. తహసీల్దార్ పాసం నాగమణితో కలిసి కొయ్యలగూడెం ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ఆమె పరిశీలించారు. అనంతరం బాలికల భాగంలో జరుగుతున్న క్రీడలను ఉద్దేశించి మాట్లాడారు. బాలిక ఉన్నత పాఠశాలలో ఖోఖో, టెన్నికాయిట్, షటిల్, పోటీలు నిర్వహించారు.

అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం

కామవరపుకోట: క్రీడల ద్వారా అందరినీ ఆరోగ్యవంతులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో కంతేటి శ్రీదేవి అన్నారు. మండలంలోని ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు మానుకొండ సుబ్బారావు పర్యవేక్షణలో క్రీడాకారులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం, ఆటల ద్వారా ప్రతి ఒక్కరికీ శరీర దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించి, వ్యాధులబారిన పడకుండా ఈ కార్యక్రమం నిర్వస్తోందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడల్లో పోటీతత్వం పెంచి యువతను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఆమె తెలిపారు.



జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



కొయ్యలగూడెం: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



కామవరపుకోట: ఆడమిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

డాక్టర్ బిందు ఫిలిప్‌కు సత్కారం



సన్మానిస్తున్న సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: మెట్ట ప్రాంతంలో గత 57 ఏళ్లగా మెరుగైన వైద్యసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందిన నిర్మల ఆస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణం అని సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు అన్నారు. శుక్రవారం ఆస్పత్రి నందు ఫౌండేషన్ ఆధ్వర్యాన వైద్యులు సిస్టర్ బిందు ఫిలిప్‌ను శాలువాతో సత్కరించారు. వైద్యురాలు బిందు ఫిలిప్‌ను క్రిస్టియన్ మైనార్టీ మెడిసిన్ విభాగంలో బెస్ట్ డాక్టర్‌గా ప్రభుత్వం గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెల 20న అవార్డును అందజేసింది. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కలపర్తి విజయ్, వీరమల్ల వరలక్ష్మి, పండూరి రామ్‌సాయి, సాజన్ సాయి, దగ్గుమేల్లి అశోక్ పాల్గొన్నారు.

నూకాలమ్మకు వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీ చక్ర సహిత శ్రీ నూకాలమ్మకు రజత వస్త్ర తయారీ నిమిత్తం తమ్మినీడి నీలిమ, శ్రీనివాస్ దంపతులు 10 తులాల వెండి, కొత్తపల్లి కిరణ్, ఇందిర జ్యోతి దంపతులు 10 తులాల వెండి, యర్రా సూర్య ప్రకాశరావు, నాగరత్నం దంపతులు(తాడువాయి) 10 తులాల వెండి, పోలోజు ఉమామేశ్వరాచారి, వాణి దంపతులు(జీలుగుమిల్లి) 5 తులాల వెండిని శుక్రవారం సమర్పించారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన గొర్రెల శ్రీధర్‌తో కలిసి ముప్పైమంది ఆంజనేయ స్వామి మాలధారులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నూకాంబిక సేవా బృందం, ఆలయ మేనేజర్ చిటికెన రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం కావాలి



గిరిబాబు గౌడ్‌ను సత్కరిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించేలా యూత్ కమిటీలు పనిచేయాలని పార్టీ ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలోని చిట్టూరి గణేష్‌రావు టౌన్ హాల్‌లో యూత్ కమిటీల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే 2024 ఎన్నికల్లో ఏలూరు జిల్లా పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాలు, ఎంపీ స్థానాల్లో యువతను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. అన్ని స్థానాల్లో విస్తృత స్థాయిలో ప్రచారం చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజయాన్ని బహుమతిగా ఇస్తామని చెప్పారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించి యువతకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ యూత్ జనరల్ సెక్రటరీ కందుల దినేష్ రెడ్డి, జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు మణి కిషోర్ వర్మ, చల్లారి నాగబాబు, కొల్లూరి దినేష్, జిల్లా సెక్రటరీలు, మున్సిపల్ కౌన్సిలర్లు నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్, పంది రాజా, తల్లాడి సంజయ్, గంజి వినోద్, మండల యూత్ నాయకులు పాల్గొన్నారు. నాయకులు గిరిబాబు గౌడ్‌ను సత్కరించారు.

పోలవరం ఇన్‌చార్జి నియామకంపై హర్షం



బాణసంచా కాల్చుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా తెల్లం రాజ్యలక్ష్మి నియామకంపై పార్టీ శ్రేణులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. కొయ్యలగూడెం గణేష్ సెంటర్‌లో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ నూకల రాము ఆధ్వర్యాన బాణసంచా కాల్చి కేక్ కట్ చేశారు. మహిళా సాధికారత సాధించే దిశగా రాజ్యలక్ష్మిని నియమించడం హర్షదాయకమన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం గల ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు భార్య స్థానంలో ఇప్పటి వరకు అండదండలు అందించిన రాజ్యలక్ష్మి ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లో రాణించి మహానేత వైఎస్సార్ ఆశయాలను సాధించాలని ఆకాంక్షించారు.

పారిజాత గిరిలో వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు నల్లూరు రవి కుమార్ ఆచార్యులు ఆధ్వర్యాన గోదాదేవికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ధనుర్మాస గోష్టి సభ్యులు, వికాస తరంగిణి కార్యకర్తలు, కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు పాల్గొన్నారు.

నేడు గోదాదేవికి సారె సమర్పణ


ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు దిప్పకాయలపాడు వికాస తరంగిణి భక్త బృందం గోదాదేవికి సారె సమర్పించనున్నారని ఆలయ ఈవో రాంబాబు తెలిపారు.

రామావతారంలో జనార్దన స్వామి దర్శనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి శ్రీ రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. రాత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అర్చకుడు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో మౌలిక సదుపాయాలు

- ఇడా కార్యాలయంలో ప్లాట్ల ఎంపికకు లాటరీ
- చైర్మన్ బొద్దాని శ్రీనివాస్



లాటరీ ద్వారా ఎంపిక చేసి ప్లాట్ పత్రాన్ని లబ్ధిదారునికి అందజేస్తున్న ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్

ఏలూరు టౌన్: ఏలూరులోని జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో అన్ని సౌకర్యాలూ కల్పిస్తూ తక్కువ ధరకే అందిస్తూ మధ్యతరగతి వర్గాలకు లబ్ధి చేకూరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ అన్నారు. ఏలూరు ఇంద్రకీలగూడెం ప్రాంతంలోని ఇడా కార్యాలయంలో శుక్రవారం ఆయన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్ల ఎంపికకు సంబంధించి డ్రా తీశారు. ఇప్పటికే నాలుగు దశల్లో ప్లాట్ల ఎంపికకు లాటరీ తీయగా నాలుగోసారి ఆరుగురికి స్థలాన్ని కేటాయిస్తూ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. మూడు దశల్లో 74 మందికి ప్లాట్లను కేటాయించామని ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ తెలిపారు. ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏలూరులో ఎంఐజీ లేఅవుట్‌ను 36 ఎకరాల్లో ఏర్పాటు చేసిందని వివరించారు. మధ్యతరగతి వర్గాలు, ఉద్యోగస్తులకు అన్ని సౌకర్యాలతో ఇళ్ల స్థలాలు అందజేయాలనే ఉద్దేశంతో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఇడా వైస్ చైర్మన్ చంద్రశేఖర్, డీఈ రామారావు, ప్లానింగ్ ఆఫీసర్ సురేఖ, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగుల చట్టంపై అవగాహన సదస్సు

పెదపాడు: దివ్యాంగుల పట్ల గౌరవ భావంతో మెలగాలని పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు అనంతపాల్ తెలిపారు. మండలంలోని పీహెచ్‌సీ వద్ద ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వైద్యులు అనంత పాల్ మాట్లాడారు. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం దివ్యాంగులు 21 రకాలుగా గుర్తించామన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కులను వివరించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం నిర్వహించు కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల పునరావాస కేంద్రం కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ అందించడంతో పాటు కేంద్రంలో యూఐడీ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పీవీటీజీల అభివృద్ధికి ప్రత్యేక కృషి



ముంజులూరులో కొండరెడ్డి గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతున్న సుషిల్ బడింగే

బుట్టాయగూడెం: గ్రామాల్లో నివసిస్తున్న పీవీటీజీల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు అండర్ సెక్రటరీ ఆఫ్ న్యూఢిల్లీ మోటా సుషిల్ బడింగే తెలిపారు. మండలంలోని ముంజులూరు, ఉప్పరిల్ల గ్రామాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్య తేజతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని కొండరెడ్డి గిరిజనులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీఎం జన్మాన్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం పీవీటీజీల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందని తెలిపారు. రేషన్ కార్డులు, పింఛన్లు, రహదారి సమస్యలు తదితర అంశాలపై కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఐటీడీఏ పీఓ సూర్యతేజ మాట్లాడుతూ కొండరెడ్ల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే పలు సమస్యలను కొండరెడ్డి గిరిజనులు వారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం పీఎం జన్మాన్‌కు సంబంధించిన పత్రాలను కొండరెడ్డి గిరిజనులకు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, తహసీల్దార్ శారా శాంతి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, వెలుగు ఏపీడీ నాగేశ్వరరావు, ఎంఈఓ టి.బాబూరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన గంజిమాల దంపతులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సంభాషిస్తున్న గంజిమాల దంపతులు

కొయ్యలగూడెం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, ఎంపీపీ రామారావు దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. హెలిప్యాడ్ వద్దకు వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గంలో అఖండ విజయానికి కృషి చేయాల్సిందిగా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గంజిమాల దంపతులకు సూచించారు.

నేడు జిల్లాకు రానున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ శనివారం ఏలూరు జిల్లాకు రానున్నారు. ఆయన విజయవాడ నుంచి బయలుదేరి ఉదయం 11.30 గంటలకు పెదవేగి మండలం వేగివాడ చేరుకుంటారు. సెయింట్ జోసఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను సందర్శిస్తారు. ఇటీవల పాఠశాలలో పనిచేసే తెలుగు ఉపాధ్యాయుడు కొత్తపల్లి రత్తయ్య ఆత్మహత్యకు దారితీసిన ఘటనపై ప్రసాద్ విచారణ చేపట్టనున్నారు.

నగరాభివృద్ధికి కృషి చేస్తాం



స్టాండింగ్ కమిటీ సభ్యులతో మేయర్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్

ఏలూరు టౌన్: నూతన స్టాండింగ్ కమిటీ ఏలూరు నగర అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ ప్రస్తుత స్టాండింగ్ సభ్యుల పదవీకాలం ఈ నెల 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో నూతనంగా ఐదుగురు స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండటంతో ఈ నెల 11న నూతన కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేశారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఐదుగురు సభ్యులు నామినేషన్ పత్రాలను దాఖలు చేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మేయర్ నూర్జహాన్ తెలిపారు.

స్టాండింగ్ కమిటీ సభ్యులు వీరే

నూతన స్టాండింగ్ కమిటీ సభ్యులుగా 11వ డివిజన్ కార్పొరేటర్ కోయా జయగంగ, 17వ డివిజన్ కార్పొరేటర్ పాము పద్మ, 21వ డివిజన్ కార్పొరేటర్ అన్నపనేని భారతి, 31వ డివిజన్ కార్పొరేటర్ పోతర్లంక లక్ష్మణ్, 41వ డివిజన్ కార్పొరేటర్ ఈదుపల్లి కల్యాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఏలూరు ఎమ్మెల్యే సారథ్యంలో ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, కలవకొల్లు సాంబ, మాజీ కార్పొరేటర్ బందారు కిరణ్, కార్పొరేషన్ సెక్రటరీ ప్రభుదాస్, సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా బాలస్వామి నియామకం

పెదవేగి : ముండూరుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రాచూరి బాలస్వామిని పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ అధిష్టానం నుంచి వచ్చిన నియామక పత్రాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అందజేశారు. ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుని ఊరేగింపు



ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ద్వారకాతిరుమల: క్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఊరేగింపు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక సంత మార్కెట్ సమీపంలోని ఆశ్రమం వద్ద షష్ఠి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని కమిటీ సభ్యులు స్వామివారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తిని ఉంచి, డప్పు వాయిద్యాలు, డీజే సందళ్ల నడుమ గ్రామంలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించారు.

సీపీఐఎంఎల్ రెడ్ స్టార్ పార్టీ సమావేశం

జంగారెడ్డిగూడెం: పీడిత ప్రజల కోసం ఐక్యంగా పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ప్రజా సంఘాలు ఆ దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని సీపీఐఎంఎల్ రెడ్ స్టార్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.జె.జేమ్స్ అన్నారు. జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్‌లో శుక్రవారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐఎంఎల్ ఏపీ రాష్ట్ర కమిటీ, సీపీఐఎంఎల్ రెడ్ స్టార్ పార్టీలు దేశంలో జరుగుతున్న అనేకమైన విషయాలపై చర్చించి రెండు పార్టీలు కలిసి ఒకే పార్టీగా రెడ్ స్టార్ పార్టీగా ఏర్పడిందని తెలిపారు. సమావేశంలో ఏఐకేకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రంగనాథం పాల్గొన్నారు.